

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు. ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్ధం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**షుమారు ఆరునెలలు** కమలకి స్పృహ రాలేదు. వో రోజు హఠాత్తుగా స్పృహ వచ్చింది.

"నేను తప్పు చేయలేదు" అంది మొదటిసారిగా.

"లేదు." దృఢమైన పురుష కంఠ స్వరం ఆమె కర్ణేంద్రియాలకు వినిపించింది.

"మీరు నమ్ముతున్నారా అలా అని." క్షీణస్వరంతో ప్రశ్నించింది.

"ముమ్మాటికీ నమ్ముతున్నాను." అదే పురుష స్వరం.

"నన్ను  మీ భార్యగా స్వీకరిస్తారా?"

క్షణకాలం మౌనం.

“మీ భార్యగా నన్ను స్వీకరిస్తారా?”

“లేదు.”

“కారణం?”

“నేను మీ భర్తను కాను  గనుక.”

ఆమె మెదడు పూర్తిగా చైతన్య స్థితిలోకి వచ్చేసింది. ఎదుటి వ్యక్తిని గుర్తుపట్టేందుకు పరిశీలించి చూచింది. చాలా రోజుల తర్వాత  ఓ ‘వేగ్’ (అయోమయప స్థితి) లో వున్న మెదడు… చీకటికి అలవాటు పడినట్లు మూసుకుపోయిన కళ్ళు ఒక్కసారిగా వెలుగుని చూడలేక క్రమ క్రమంగా వెలుగు చూచేందుకు ప్రయత్నిస్తున్నాయి.

“మీరు నా భర్త కారా?”

“కాదు. నేను డాక్టరు రామచంద్రాన్ని.”

“డాక్టరు రామచంద్రం!”

“అవును. మీరు నా పేషెంటు.”

షుమారు వో గంట తర్వాత కమల మామూలు స్థితికి వచ్చేసింది.

ఆ రోజు తాను ఆ హోటల్ గదిలో స్పృహ తప్పి పోయే క్షణంలో ఈ రామచంద్రాన్ని చూచిన గుర్తు రాలేదు గానీ అంతగాడు చెప్పిన మీదట గుర్తొచ్చింది.

ఆరు నెలలు తను స్పృహ కోల్పోయిన స్థితిలో వుందట! పత్రికలు ఈ వార్తని ప్రముఖంగా ప్రచురించాయట కూడానూ. ఓ విధంగా ‘అహల్య’ అనే రచయిత్రి కీర్తిశేషుల లిస్టులోకి వెళ్ళిపోయింది ఇంచుమించు.

“ఇది విజయవాడ. మిమ్మల్ని స్పృహ లేని స్థితిలోనే కారులో ఇక్కడికి తెచ్చి మా సుమతీ నర్సింగ్ హోంలో ఉంచుకున్నాను. మీకు స్పృహ వచ్చే పర్యంతం మీ కేసు వో ప్రయోగంగా పరిశీలించాను. ఆరునెలలకు మీకు చైతన్యం రావటం చాలా అదృష్టకరమైన విషయం” అన్నాడు రామచంద్రం.

“మరి మా శ్రీవారెక్కడ?” అంది ఆదుర్దాగా కమల.

“తెలీదు.”

"తెలీదా?"

"మీరిలా స్పృహ కోల్పోగానే ఆయన వెనుదిరిగి వెళ్ళిపోబోయారు, నేనే కల్పించుకుని ఆగమని కోరాను. మిమ్మల్ని మా లలితా నర్సింగ్ హోంకు తెచ్చాం. డాక్టరు లలిత, నేను ఆ రోజంతా మీకు స్పృహ తెప్పించాటానికి యెన్నో విధాలుగా, మా వైద్య విజ్ఞానం అంతా ఉపయోగించి ప్రయత్నించాం. ఊహుఁ! మీకు స్పృహ వచ్చే సూచనలు కన్పించలేదు.

అందాకా మౌనంగా వుండిపోయారు మీ భర్తగారు. ఎవరితోనూ ఏమీ మాట్లాడలేదు, ఈ లోలోగా శాంతి ద్వారా మీరు శ్రీహరిరావు మాష్టారు గారమ్మాయి అని తెలుసుకున్నాను. మాస్టారుగారి మీద నాకున్న గౌరవం కొద్దీ మీకు వైద్యం చేసే బాధ్యత వహిస్తాను అని నేను అన్నాను. మీ శ్రీవారు వెళ్ళిపోయారు.

మూడు రోజుల తర్వాత మీ శ్రీవారి వద్ద నుంచి లోకల్ పోస్టులో వో కవరు వచ్చింది. అందులో  మీరు ఎన్నాళ్ళు ఈ స్థితిలో ఉంటారో తెలియదు కాబట్టి తన బ్యాంకి బ్యాలెన్సు అంతా మీ వైద్యానికి ఖర్చు పెట్టి, మిగిలిందలా వుంచి, ఎప్పుడేనా స్పృహ వస్తే మీరు జీవించడానికి ఆ డబ్బు ఉపయోగించమని కోరుతూ నాకు ఆ బాధ్యత అప్పగిస్తూ ఉత్తరమూ, బ్యాంకి పుస్తకమూ వచ్చింది. తాను ఉద్యోగానికి రాజీనామా చేసి, ఏదేనా ఆశ్రమంలో గడపడానికి వెళ్ళిపోతున్నట్లు వ్రాసారు గోపాలరావుగారు ఆ ఉత్తరంలోనే చివరగా. ఏ ఆశ్రమానికి వెళ్ళారో తెలీదు."

కమల నిర్ఘాంత పోయినట్లు కూర్చుండి పోయింది. గోపాలరావు ఏ ఆశ్రమానికి వెళ్లి ఉంటాడు? తన శేష జీవితం ఏమిటి?

"మీకు వైద్యానికంటూ పెద్దగా ఖర్చు కాలేదు. కానీ, చాలా జాగ్రత్తగా పరిశీలించటానికి ఓ మనిషి, ఏ వేళ కా వేళ మీకు ఇంజక్షన్ల ద్వారా ఆహారమూ వగైరా (శరీర పోషణకి అవసరమైన ఏర్పాటు) జరిపించటానికి కొంత ఖర్చు అయింది. మిగతా దాన్నుండి. మీరు కొంతకాలం ఇక్కడ విడిగా వో రూంలో వుండి, మీకు బాగా స్వస్థత చేకూరాక ఏదో ఓ వృత్తి చూచుకోవచ్చు. అందాకా నేను మీకు చేయూత యిస్తాను" అన్నాడు రామచంద్రం.

కమలకు ఇక వేరేదారి కనిపించలేదు.

"నాకో చిన్న రూం చూడండి. కానే అది ప్రత్యేకంగా ఉండేలా చూడండి. నా పేరు అహల్య అని గాక కమలగానే ఉండనివ్వండి. అహల్య పాఠకుల దృష్టిలోనే గాక నిజ జీవితంలో కూడా చనిపోయినట్లే లెక్క. ఎప్పుడేనా వారి జాడ తెలిస్తే వారి దగ్గరకు వెళతాను. వారు క్షమించనీండి, క్షమించక పోనివ్వండి" అంది బేలగా.

"అలాగే" అన్నాడు రామచంద్రం.

కమలకో చిన్న ఇల్లు ఇతర వాటాలతో సంబంధం లేకుండా ఉండేలా తీసుకున్నాడు. ఆమె ఏకాంతాన్ని కోరుకుంటోంది. తన గతం పీడకలలా ఎవరూ గుర్తు చేయకుండా, గుర్తించ కుండా ఉండేలా కోరుకుంటోంది.

ఆమె డాక్టరు రామచంద్రంగారి దూరపు బంధువనీ, ఆమె ఇక్కడ ఉంటూ వైద్యం చేయించు కొంటోందనీ మాత్రం తెలుసు. ఆమె జబ్బు కారణంగా భర్త వదిలేశాడని అనుకుంటూ ఉంటారు ఆ వీధిలో వాళ్ళు గుసగుసగా.

మొదట్లో ఆమె బండలా కూర్చుని వుండేది అస్తమానూ. రామచంద్రం యెంతో ధైర్యం చెప్పిన మీదట మెల్లిగా పుస్తకాలు చదవటం, అలా కాలక్షేపం ఏర్పడింది. రామచంద్రం డాక్టరుగా గాక, వో తోబుట్టువులా, తండ్రిలా, దైవంలా అనిపించసాగాడు ఆమెకు.

"మళ్ళీ కథలూ, నవలలూ రాస్తుండు కమలా! కాలక్షేపం అవుతుంది. నీ మీద నీకు ఆత్మవిశ్వాసమూ వస్తుంది" అన్నాడో రోజు రామచంద్రం.

"ఊహుఁ! వ్రాయలేను రామచంద్రం. ఆ భావావేశం పోయింది నాలో" అంది.

"మా ఊర్మిళ ఏవో కొన్ని కాగితాలు వ్రాసి పడేసింది. అలాటివి పూర్తి చెయ్యి. భావా'వేశం పోలేదు నీలో. తాత్కాలిక నిస్పృహ ఆవరించిందంతే. నార్త్ లో చాలా ఆశ్రమాలు ఉన్నాయి. నా ఫ్రెండ్స్ కొందరికి మీ శ్రీవారి వివరాలు యిచ్చి అటువేపు ఆశ్రమాలలో ఎక్కడేనా ఉన్నారేమో ఆరా తీయమని కోరాను. ఎప్పుడో వో నాడు మీ శ్రీవారి జాడ తెలియక పోదు. నీ కోరిక ప్రకారం నీవు ఆయనగారి దగ్గరకే వెడుదువు గాని" అన్నాడు.

"ఊర్మిళ ఎవరు?" ఆమె కుతూహలంగా అడిగింది.

"ఊర్మిళా! ఎవరని చెప్పను?' నవ్వేశాడు.

"అంటే?' మరింత కుతూహలంగా అడిగింది.

"ఊర్మిళ గురించి చెప్పాలంటే ఎంత కథో చెప్పాలి. ఇప్పుడు కాదు." అంతే జవాబు.

ఆ రాత్రి ఊర్మిళ వో విచిత్ర దృశ్యం చూచింది. అది ఆమె ఊహించనిది.

సీత, రామానుజం అతి సన్నిహితంగా...

ఆమె నిర్ఘాంతపోయింది.

సీతక్క, రామానుజం ... తన భర్తతో ఇలా మెలగుతోందా! ఎప్పటినుంచి? ఇదెలా సంభవమయింది?

ఊర్మిళ రావటం చూచి కూడా సీత అలాగే ఏమీ కొత్త జరగటం లేదన్నట్లు రామానుజం చేయి తన చేతిలోకి తీసుకుని అంది.

"నువ్వు చూశావా ఊర్మిళా! చూడాలనే..." ఆమె ఏదో చెబుతోంది వడవడ.

ఊర్మిళకేం వినిపించటం లేదు. చెవుల్లోంచి, తల లోంచి ఏదో హోరు... కడుపులో ఒక్కసారిగా నొప్పి...

మరుక్షణం గర్భస్రావం జరిగేందుకు చిహ్నంగా నొప్పులు రావటం ప్రారంభించాయి.

ఆమెను లలితా నర్సింగ్ హోంలో చేర్పించారు ఆ రాత్రే.

ఆమెకు గర్భస్రావమయింది, మూడోరోజున గర్భంకోశం తొలగించే ఆపరేషను చేయాలని నిర్ణయించుకుంది డాక్టర్ లలిత.

"లలితా! నాకు అసలు స్పృహ రాని దీర్ఘ నిద్ర పోవాలని వుంది" అని మాత్రం అంది ఊర్మిళ ఆ రాత్రి.

ఏదో జరిగి ఉంటుందని వూహించుకుంది లలిత. ఎంత తరచినా చెప్పలేదు ఊర్మిళ.

మరునాడు ఉదయం...

"హలో ఊర్మిళా! హౌడుయు డూ? రాత్రి బాగా నిద్ర పట్టిందా?"

త్రుళ్ళి పడింది ఊర్మిళ. అందాకా తనకు చాలా ఇష్టమయిన 'ఊర్మిళ' పాత్ర గురించి మనసులో ఊహించుకొంటున్న ఓ దృశ్యం మాయమైంది. విశాలంగా వున్న ఆ రూంలో పెద్ద కిటికీ ప్రక్కనే వున్న విశాలమైన బెడ్ మీద ఒంటరిగా పడుకుని వున్న ఊర్మిళ తలతిప్పి గది గుమ్మం కేసి చూసింది. లలిత నవ్వుతూ కర్టెను తొలగించుకుని వచ్చింది. బెడ్ మీద కూర్చుంది కూడాను.

"ఏమిటే ఆ చూపు ఊర్మిళా! నిద్ర లోంచి లేచినదానికి మల్లే. నేనేం కొత్తదాన్నా?" అంది మెడలో వున్న స్టెతస్కోపుతో సుతారంగా ఓ దెబ్బ వేస్తూ,

“ఆఁ! ఇంతకు ముందు ఓ అరగంట ముందే నిద్ర లేచాను లలితా. నువ్వేదో స్లీపింగ్ టాబ్లెట్ ఇచ్చినట్లున్నావు. రాత్రంతా మెలకువే లేదు. కలలేం వచ్చాయో కూడా గుర్తులేదు” అంది ఊర్మిళ నవ్వుతూ, బెడ్ మీద బాసింపట్టు వేసుక్కూర్చుంటూ.

“బ్రతికించావు. కలలు గుర్తుంటే ఆ కలల ఫలితం ఏమిటోనని సతాయిస్తావు. అన్నట్లు మీ శ్రీవారికి ఇందాకే ఫోను చేసి చెప్పాను. “స్వామీ, తమరి శ్రీమతి ఊర్మిళాదేవిగారికి ఈ రోజు ఆపరేషను చేస్తాను” అని. తెలిసిన సంగతే అయినా కంగారు పడ్డాడులా వుంది మానవుడు!”

“నేను వస్తాను ఉండండి లలితా! నేను వచ్చాక చేద్దురు గానీ” అంటూ తెగ బాధపడిపోయాడు ఫోనులో.” లలిత నవ్వింది.

“ఆపరేషను ఎన్ని గంటలకి చేస్తావు?” కుతూహలంగా అడిగింది ఊర్మిళ స్నేహితురాలి వంక చూస్తూ.

“నా ఇష్టం. నాకెప్పుడు తిక్క రేగితే అప్పుడే చేసేస్తాను.” సీరియస్ గా అని అంతలోనే పకపక నవ్వుతూ, “రోగాలకీ, ఆపరేషన్లకీ ముహూర్తాలు పెడతారా ఎవరేనా? ప్రస్తుతం నగరంలో కరెంట్ సమ్మె దిగ్విజయంగా నడుస్తోంది కదా. బహుశా ఈ రోజు మధ్యాహ్నం నుంచీ సమ్మె విరమిస్తారట. కరెంటు రాగానే మొదటి ఆపరేషను నీదే! అందాకా ఆహారం ఏమీ తీసుకోవద్దు. మరీ వుండబట్టలేకపోతే ఓ అర కప్ కాఫీ తాగు. అదీ తీసుకోకున్నా మంచిదే. ఎమ్టీ స్టమక్ అయితే, అనస్తీశియా ఇచ్చాక స్పృహ వచ్చాక వాంతులు వగైరా గొడవ వుండదు” అంది లలిత.

“పేషెంట్సుని చూసి వచ్చావా?” ఊర్మిళ అడిగింది,

“ఆహా! ఓ రౌండు తిరిగొచ్చే తాపీగా నీ దగ్గర కూర్చున్నాను, పురాణ కాలం నాటి ఊర్మిళలానే నువ్వూ నిద్ర పోతున్నావు, నేనొచ్చేసరికి.”

“నిద్ర పోలేదు. ఊరికే కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నాను.”

“ఏమిటంత ఆలోచన?”

“ఎంచేతో ఊర్మిళ గుర్తొచ్చింది.”

“వస్తుంది. హిందీ పరీక్షలకి నువ్వు చదివే రోజుల్లో నీకు వాగా నచ్చినది మైథిలీ శరణ గుప్తా వ్రాసిన ‘ఊర్మిళ’ కదూ! మేమంతా అది తేలిగ్గా పాఠంగా తీసుకున్నాం గానీ నువ్వు మాత్రం అస్తమానూ నీ జీవితానికి అన్వయించుకుంటూ ఉంటావు. అలా చెబుతుంటావు కదా నువ్వు అస్తమానూ.”

"రాజు ఉన్నారా ఇంట్లో?" మాట మారుస్తూ అంది ఊర్మిళ.

"లాయర్ రాజుగారా! మా పతిదేవులా, వున్నారు. ఉదయాన్నే వో జిడ్డు క్లయింటు... బాగా డబ్బున్నవాడులే, కారులో వచ్చి పడ్డాడు. వాణ్ని చూడగానే నాకు అనిపించింది, వీడు అరడజను హత్యలు, రెండు మానభంగాలు, మూడు ఫోర్జరీ నేరాలయినా చేసి ఉంటాడని. తనని రక్షించమని రాజును కాళ్ళా వెళ్ళా పడుతున్నాడు.

'బి కేర్ ఫుల్ రాజూ! యువర్ క్లయింట్ సీమ్ ద్ టు బి ఎ మర్డరర్' అన్నాను బెడ్ రూంలో, నవ్వుతూ గుసగుసగా.

రాజు నవ్వి, "నీ మొహం. నువ్వెళ్ళి నీ పేషెంట్స్ ని చూసుకో. నువ్వు డాక్టరువి. నేను లాయర్ ని! నీ కేసుల్లో నేనూ, నా కేసుల్లో నువ్వూ తల దూర్చామంటే నీ పేషంట్సూ నా క్లయింట్స్ నిజంగా స్వర్గం చేరుతారు. వాడు ఖూనీకోరో, బాతాకోరో వాడి నోటి వెంటే చెప్పించి ఆ తర్వాతే కేసు వింటాను. నీ మొగుడి మీదా, అతగాడి వృత్తి మీదా, అతగాడి టాలెంట్ మీదా నువ్వు నమ్మకం పెంచుకోవాలి" అంటూ దులిపేశాడు. ఉదయానే ఉపన్యాస హింసా కాండ ఎందుకులెమ్మని నేరుగా కింది పోర్షనుకు వచ్చి పడి, 'లలితా నర్సింగ్ హోం' లోని పదహారో నెంబరు రూంలో అపర ఊర్మిళలా నిద్రలో వున్నా నా స్నేహితురాలు ఊర్మిళను చూడటానికి వచ్చేశాను. అదీ కథ" అంది లలిత.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments